క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ

కడప ఎడ్యుకేషన్ : గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్–2025 క్యాలెండర్‌ను ఆదివారం కడప రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ లక్ష్మి నరసమ్మతో పాటు సంఘం అధ్యక్షులు డాక్టర్ ఫరూక్, కార్యదర్శి డాక్టర్ సుబ్బారాయుడు, సభ్యులు డాక్టర్ యు.శ్రీనివాస్, డాక్టర్ యాదవేంద్రరెడ్డి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ స్వామి దాస్, డాక్టర్ షాహిద్, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వేలూరు భారతి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధకురాలు వేలూరు భారతికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు టి.రామప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో 'ఒక శతాబ్దపు రాయలసీమ కథానిక–స్త్రీ (1926 నుండి నేటి వరకు)' అనే అంశంపై ఈమె చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావు తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన భారతి అధ్యాపకురాలిగా పనిచేస్తోంది.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిన్నపరెడ్డి



చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన లయన్ కె.చిన్నపరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంస్థ జనరల్ బాడీ ఎన్నికలు విశాఖపట్టణంలో నిర్వహించారు. ఇందులో సభ్యులంతా అధ్యక్షుడిగా యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా ఇంటాక్ కడప జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణరాజులను ఎన్నుకున్నారు.

రిపబ్లిక్ డే పెరేడ్‌కు జిల్లా విద్యార్థిని




ఢిల్లీ గణతంత్ర దినోత్సవ పెరేడ్‌కు ఎంపికైన సుమయ

కడప ఎడ్యుకేషన్ : ఢిల్లీలో ఈనెల 26వ తేదీ నిర్వహించబోతున్న గణతంత్ర దినోత్సవ పెరేడ్‌కు కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థి సుమయ ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గులాంబాషా, ఎన్‌సిసి సిటిఓ డాక్టర్ స్వరూప తెలిపారు. ఈ విద్యార్థి గతంలో కూడా గుంటూరు, హైదరాబాద్, చిత్తూరు, తిరుపతి కడపలో నిర్వహించిన యాన్యువల్ క్యాంప్, పీఆర్‌ఈ ఆర్‌డీసీలలో పాల్గొని బెస్ట్ కెడెట్ ఇన్ డ్రిల్‌ను సంపాదించుకున్నారు. ప్రీ ఆర్‌డీసీ–1, 2, 3, ఫైనల్ ఆర్‌డీసీలో పాల్గొని ఆ తర్వాత ఢిల్లీ పెరేడ్‌కు ఎంపిక అయ్యారని తెలిపారు. సుమయ ప్రస్తుతం ఢిల్లీలో శిక్షణలో ఉందని వారు తెలిపారు.

రవీంద్రనగర్‌లో చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్ బ్రిడ్జి సమీపంలోని ఇంటిలో సయ్యద్ సత్తాజీ అనే మహిళ నివసిస్తోంది. ఆమె భర్త సయ్యద్ మస్తాన్ వారం రోజుల క్రితం కువైట్‌కు వెళ్లారు. ఈనెల 18న సత్తాజీ మదనపల్లెలో తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇంటిలో వస్తువులన్నీ చిందరవందరగా పడేసి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు గమనించి సయ్యద్ సత్తాజీకి ఫోన్ చేశారు. ఆమె కడపకు వచ్చి చూడగా ఇంటిలో తాను దాచుకున్న రూ. 2లక్షలు నగదుతో పాటు బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. తన సమీప బంధువు నిర్వాకమే ఇదంతా అని ఆమె ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కడప తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టెంకాయల వేలం పాట




వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కొత్తపేట గంగమ్మ దేవస్థానంలో సోమవారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. టెంకాయల విక్రయానికి పోటాపోటీగా వేలం పాట పాడారు. అయితే వెంకటలక్ష్మి అనే మహిళ రూ.4,01,000 దక్కించుకున్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 2026, జనవరి 31వ తేది వరకు వేలం పాట నిర్వహించారు.

హౌసింగ్ కాలనీలో సమస్యల తిష్ట



టిడ్కో–2 లే ఔట్‌లో అలంకారప్రాయంగా ఉన్న వీధి లైట్లు



నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకు

- పనిచేయని వీధి దీపాలు, తాగునీటి బోర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కడప కార్పొరేషన్ : కడప నగరం వైఎస్సార్ పోలీస్ కాలనీ వద్దనున్న టిడ్కో–2 ఎన్‌టీఆర్ పీఎంఏవై హౌసింగ్ కాలనీలో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో అత్యధిక మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ప్రభుత్వం మారిపోయిన తర్వాత ఈ కాలనీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం జగనన్న కాలనీల పేరు మార్చిందే తప్పా అక్కడ మౌళిక వసతులు కల్పించడంలో శ్రద్ధ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. హౌసింగ్ కాలనీలో ఆర్‌డీఎస్‌ఎస్ స్కీం ద్వారా కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి, లైన్లు లాగారు. వీధి దీపాలు కూడా అమర్చారు. కానీ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో వీధి దీపాలు వెలగడం లేదు. అలాగే ఇక్కడ వేసిన రెండు బోర్లు పనిచేయకపోవడంతో ప్రభుత్వం నిర్మించిన వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఇళ్లు పూర్తి చేసుకున్నవారు, ఇప్పుడిప్పుడే ఇళ్లు నిర్మించుకుంటున్న వారు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన అగత్యం ఏర్పడింది. అన్ని వీధుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. చెత్త ఎత్తేవారు, రోడ్లు ఊడ్చేవారు రాకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త దిబ్బలే దర్శనమిస్తున్నాయి. దీంతో రాత్రిళ్లు విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చీకటి పడిందంటే ఇక్కడ బయటికి రావాలంటేనే జనం భయపడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ చూపి కాలనీలో మౌళిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శుభాకాంక్షల వెల్లువ



మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను సన్మానిస్తున్న 50వ డివిజన్ నాయకులు



అంజద్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సోమవారం 50వ డివిజన్ నాయకులు రమణ, అశోక్ ఆధ్వర్యంలో అంజాద్ బాషాను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు ఏ1 నాగరాజు ఆధ్వర్యంలో అంజద్‌బాషాను సత్కరించారు.

జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు సాయిదత్త, నగర సేవాదళ్ అధ్యక్షులు అర్జున్, నగర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సాయిబాబా, రాజా, షేర్ ఖాన్ తదితరులు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య, సౌత్‌జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, రమేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

కడప సెవెన్‌రోడ్స్ : ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీపై అదనపు ఛార్జీలు డెలివరీ బాయ్స్ వసూలు చేస్తే జిల్లా పౌరసరఫరాల అధికారికి ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబరు 1967కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలోని పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు అలాంటి సందర్భాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, డెలివరీ బాయ్స్ ఇద్దరిపై చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

ఏఎస్పీని కలిసిన ఎమ్మెల్యే ఆకేపాటి



ఏఎస్పీని కలిసిన ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట : రాజంపేట ఏఎస్పీగా బాధ్యతలు తీసుకున్న మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కలిశారు. ఏఎస్పీ కార్యాలయంలో ఆయన చాంబరులో ఏఎస్పీకి శాలువా కప్పి, బొకేను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎస్పీతో పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, న్యాయవాది గురుప్రతాప్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ దాసరి ప్రశాంతిపెంచలయ్య, పార్టీ నేతలు సుబ్బరాజు, మల్లికార్జునరాజు, ఎంపీటీసీ మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



బహుమతులు గెలుచుకున్న కార్గో వినియోగదారులతో అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిన కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కడప జోన్ ఈడీ పైడి చంద్రశేఖర్, జిల్లా ప్రజా రవాణధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని కార్గో కార్యాలయంలో డోర్ డెలివరీ సేవలను ప్రోత్సహిస్తూ లక్కీ డిప్ ద్వారా ఎంపికై న వారికి ఆర్‌ఎం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత డిసెంబరు 20 నుంచి జనవరి 19వ తేది వరకు ఆర్టీసీ కార్గో డోర్‌డెలివరీ మాసోత్సవాలను నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా డిసెంబరు 30, జనవరి 6, 13, 19 తేదీలలో లక్కీడిప్ తీసి వినియోగదారులకు కొత్తాస్ సంస్థ సహకారంతో బహుమతులు అందించామన్నారు. ఈ మాసంలో అత్యధికంగా జిల్లాకు మొదటి స్థానం దక్కిందన్నారు. ఇందుకు సహకరించిన ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, వినియోగదారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారాన్ని అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం (కమర్షియల్) జనార్ధన్, కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, సీఐ కన్యాకుమారి, ఎస్‌టీఐ మంజుల, ఆర్‌ఎంఈ రామచంద్ర, డీఎంఈ గురుప్రసాద్ రెడ్డి, డీఐఓ వీరాంజేయులు, కార్గో కాంట్రాక్టు సూపర్‌వైజర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులోకం మాసపత్రిక ఎంతో ఉపయుక్తం



డైరీ, మాస పత్రికను అవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

కడప ఎడ్యుకేషన్ : రైతులోకం మాసపత్రికతో రైతుల పంటలసాగుకు అనుకూలమైన ప్రచురణలు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. కడప కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముద్రించిన రైతన్న డైరీని, మాసపత్రికను జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతులోకం మాసపత్రికను గత 15 సంవత్సరాలుగా అందిస్తుండటం అభినందనీయమన్నారు. రైతన్న డైరీని, మాస పత్రికను రైతులు ఒక కరదీపికగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బాలచంద్రయ్య, చిలుంగారి పెద్ద పుల్లయ్య, శంకర్ రెడ్డి, దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వీరపునాయునిపల్లె : బుడ్డ శనగలో సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లను నివారించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్ బాబు, గిరీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలిసి శనగ పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం శనగ పంటలో వేరుకుళ్లు, త్రుప్పు కుళ్లు సోకినట్లు గుర్తించామని తెలిపారు. నీటి ఎద్దడి సమయంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు వేరు కుళ్లు తెగులు ఎక్కువగా ఆశిస్తుందని, పూత, కాయ దశలో ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. సకాలంలో విత్తుకోవడం వలన పంటలు చివరి దశలో నీటి ఎద్దడికి అధిక ఉష్ణోగ్రత్తలకు గురికాకుండా చూసుకోవడం వలన తెగుళ్ల తీవ్రతను తగ్గించవచ్చని తెలిపారు. తెగుళ్ల ఉధృతిని తగ్గించేందుకు ఎకరాకు 2 కిలోలు ట్రైకోడెర్మా పాడిని 4 కిలోల వేప చెక్కతో కలిపి పశువుల ఎరువులో 10–15 రోజుల వ్యవధిలో పొలంలో చల్లుకోవాలని సూచించారు.

పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రొద్దుటూరు : పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులందరూ సంఘంలో చేరి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పద్మశాలి కల్యాణ మండపం అధ్యక్షుడు అవ్వారు తాండవ కృష్ణ మాట్లాడుతూ సంఘం సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని శాఖల సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోము జ్ఞానశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ చుప్పల విజయకుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు రాటాల గోపి పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను చెత్తలో వేస్తే కఠిన చర్యలు

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి



మార్నింగ్ విజిట్‌లో పాత మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : చికెన్ వ్యర్థాలను చెత్త పాయింట్లలో వేస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన డీసీసీ బ్యాంకు, ఎన్‌టీఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి, పాత మార్కెట్, మాచుపల్లి బస్టాండు, భగత్ సింగ్ నగర్, జెడ్పీ అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మెయిన్ రోడ్లలో స్వీపింగ్ అంతా తెల్లవారుజామునే జరిగేలా చూడాలని ఆదేశించారు. హోటళ్లలోని వ్యర్థాలను రోడ్లపై వేసినా, చికెన్ వ్యర్థాలను చెత్తలో వేసిన జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఏడురోడ్ల కూడలిలోని చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.

అనంతరం సెవెన్ రోడ్స్‌లో కంపాక్టర్ వెహికల్ చెత్త పాయింట్లను, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి హ్యాండ్ వాష్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆప్రాంతంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

పగలు మార్కెట్ రద్దీగా ఉంటుంది కాబట్టి తెల్లవారుజామున లేదా రాత్రి వేళల్లో శానిటేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి..

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గత వారం వచ్చిన అర్జీలను ఏ విధంగా పరిష్కరించారో అడిగి తెలుసుకున్నారు. ఇందులో మొత్తం 18 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అర్జీలు–3, టౌన్‌ప్లానింగ్–5, రెవెన్యూ–6, హెల్ విభాగం–2, యూపీఏ విభాగం అర్జీలు –2 వచ్చాయి. వచ్చిన అర్జీలను శాఖధిపతులు స్వయంగా వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే రాకేష్ చంద్ర, ఎస్‌ఈ చెన్నకేశవరెడ్డి, సిటీప్లానర్ రమణ, ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి పాల్గొన్నారు.

అభ్యసనంపై అవగాహన కలిగి ఉండాలి



వయోజన విద్యాశాఖ సామాగ్రిని ఆవిష్కరిస్తున్న జేసీ అదితిసింగ్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : సమాజంలో అందరికీ అభ్యసనంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవనంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం స్టిక్కర్ క్యాలెండర్, వాచకం, మార్గదర్శిని, అటెండెన్స్ రిజిస్టర్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ చిన్న తనంలో బడి చదువుకు నోచుకోని 15 ఏళ్ళు దాటిన వారికి చదవడం, రాయడం (క్రియాత్మక అక్షరాస్యత), ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలను నేర్పించి, వారు మెరుగైన జీవన ప్రమాణాలను సాధించేలా చేయడమే 'ఉల్లాస్' కార్యక్రమ ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు, వయోజన విద్య డీడీ ఎం.వెంకట సుబ్బారెడ్డి, పశు సంవర్ధక శాఖ జేడీ శారదమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, సీఈవో ఓబులమ్మ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఎలా చేస్తారు..?

కడప ఎడ్యుకేషన్ : కడప, ప్రొద్దుటూరులలో ప్రభుత్వ అనుమతులు లేకున్నా 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్స్ నిర్వహిస్తూ బహిరంగంగా ప్రకటనలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఎడిఫై స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, రేవల్యూషనరి స్టూడెంట్ యూనియన్ (ఆర్.ఎస్.యూ) జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌లు డిమాండ్ చేశారు. సోమవారం కడప వై జంక్షన్‌లోని ఆర్.ఎస్.యూ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కడప నగరం, ప్రొద్దుటూరు పట్టణంలో ఎడిఫై స్కూల్ కు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

వల్లూరు (చెన్నూరు) : భూ సర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని ఆర్డీఓ జాన్ ఇర్విన్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా నిర్వహించే భూముల రీ సర్వే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం మండలంలోని భూ రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌కు ఎన్నికైన శివాలపల్లి గ్రామంలో రీ సర్వేను ఆర్డీఓ ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ సరస్వతి ఆధ్వర్యంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రీ సర్వేకు హాజరు కావాలని సూచించారు. రైతులు గ్రామాల్లో లేకపోయినా ఈ విషయాన్ని సర్వే సమయానికి వారికి తెలియజేసి వారు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో భూముల సమస్యలు ఉంటే రెవెన్యూ సిబ్బందికి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి రీ సర్వేను పరిశీలించారు.

కుయ్....కుయ్... కుయ్యో... మొర్రో కుయ్...





కుయ్...కుయ్...కుయ్ మంటూ శరవేగంతో వచ్చి ప్రాణాపాయంలో ఉన్న క్షతగాత్రులను, అనారోగ్యంతో ఉన్నవారి ప్రాణాలు కాపాడే 108 వాహనాలు మూలనపడ్డాయి. ఇందులో పాతవాటితోపాటు కొత్తవి కూడా ఉన్నాయి. యాక్సిడెంట్ అయినవి, చక్రాలు ఊడిపోయిన వాటిని చిన్న చిన్న మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురాకుండా పాత రిమ్స్‌లో ఇలా మూలనపడేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలు తూర్పారబడుతున్నారు. – రమేష్ తీట్ల, సాక్షి ఫోటోగ్రాఫర్, కడప





ఉక్కు పరిశ్రమ కోసం పోరాటం



ఎన్నికైన డీవైఎఫ్‌ఐ నూతన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : రాయలసీమకు సంజీవని లాంటి కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేస్తామని డీవైఎఫ్‌ఐ మాజీ నాయకుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కడప ఉక్కు పరిశ్రమ పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. రాబోవు రోజుల్లో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ కోసం పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీవైఎఫ్‌ఐ నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మేరి కుమార్, కార్యదర్శిగా విశ్వనాథ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సభ్యులుగా చిన్న, సుబ్బారావు, రమేష్, పక్కీరయ్యలను ఎన్నుకున్నారు.